

అనుదినం.. జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్

08 పేజీలు | ఆదివారం 05 నవంబర్ 2023 | www.navatelangana.com

ఎర్రజొన్నల బైబ్యాక్ ఒప్పందాలే

- ఒకే ధర నిర్ణయించని ప్రభుత్వం
- ధరలో మార్పుతో రైతులకు తీవ్రనష్టం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- ప్రతి ఏటా ఇదే తంతు

5లో...



అభ్యర్థుల ఖర్చు నిరంతరం పరిశీలన

- అధికారుల్లో తడబాటు ఉండొద్దు
- సమావేశంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

8లో...



ఉత్కంఠకు తెర

- కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి.. నిజామాబాద్ అర్బన్ నుంచి షబ్బీర్‌అలీ పోటీ





నవతెలంగాణ-కామారెడ్డి

గత కొద్ది రోజులుగా కామారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరు పోటీ చేస్తారనే ఉత్కంఠకు తెరపడింది. కాంగ్రెస్ ఢిల్లీ అధిష్టానం కామారెడ్డి అభ్యర్థిపై శనివారం నిర్ణయం తీసుకుంది. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నందున ఆయనకు ధీటుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని బరిలో దించుతున్నట్టు కాంగ్రెస్ జిల్లా నాయకులు పేర్కొన్నారు. గత కొద్ది రోజుల నుంచి షబ్బీర్ అలీ కామారెడ్డి నుంచి పోటీ చేసే యోచనలో భాగంగా గెలుపు కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే ఇక్కడి నుంచి రేవంత్‌రెడ్డి పోటీ చేయనున్న నేపథ్యంలో నిజామాబాద్ అర్బన్‌లో మైనారిటీల ఓట్లు ఎక్కువగా ఉండడంతో షబ్బీర్ అలీనీ నిజామాబాద్ అర్బన్ నుంచి పోటీ చేయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఇద్దరికి బీఫాంలను శనివారం అందజేసినట్లు సమాచారం. కామారెడ్డిలో రేవంత్ 8న, నిజామాబాద్ అర్బన్ నుంచి షబ్బీర్ అలీ 9న నామినేషన్ దాఖలు చేయనున్నట్టు తెలుస్తోంది.

ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా

గట్టి నిఘా ఉంచాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎ.శక్తి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పోలింగ్‌కు రెండు, మూడు రోజుల ముందు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా అన్ని ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎ.శక్తి సూచించారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలను పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లాకు చేరుకున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నోడల్ అధికారులతో భేటీ అయ్యారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లాలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు చేపట్టిన చర్యల గురించి పరిశీలకులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, వాటిలో బాన్సువాడ సెగ్మెంట్ కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలతో కూడుకుని ఉందని ఎన్నికల వ్యయ పరిశీలకులు ఏ.శక్తి, తాన్యాసింగ్, పాటిల్ చిన్మయ్ ప్రభాకర్‌ల దృష్టికి తెచ్చారు.



మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎ.శక్తి

మిగతా 2లో...



టీయూ కబడ్డీ జట్టుకు బిచ్కుంద డిగ్రీ కళాశాల విద్యార్థి

నవతెలంగాణ-బిచ్కుంద

టీయూ పరిధిలోని అంతర్ కళాశాల పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో టీయూ క్రీడ మైదానంలో నిర్వహించిన టీయూ కబడ్డీ జట్టుకు బిచ్కుంద మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (అటానమస్) బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న సంపంగి సాయికుమార్ ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రముఖర్జీ తెలిపారు. విద్యార్థి ఈనెల 9వ తేదీన తూర్పుగోదావరి జిల్లా కాకినాడలోని జేఎన్టీయూలో జరిగే పోటీల్లో టీయూ తరపున సంపంగి సాయికుమార్ పాల్గొంటారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో పురుగుల అన్నం

- వడ్డించిన నిర్వాహకులు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని చల్లగర్గ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వాహకులు పురుగుల అన్నం వడ్డించారని సర్పంచ్ గాదె సవిత తెలిపారు. శనివారం ఆయన పంచాయతీ కార్యాలయంలో ఉండగా మధ్యాహ్నం పాఠశాలకు చెందిన విద్యార్థులు ఒకేసారి గుంపుగా తమతమ ఇండ్లకు వెళుతున్నట్లు గమనించిన సర్పంచ్ 'విద్యార్థులను ఎక్కడి కెళ్ళుతున్నారు అని ప్రశ్నించగా.. భోజనం చేసేందుకు' అని విద్యార్థులు తెలిపారు. అప్పటికప్పుడే సర్పంచ్ వార్డు సభ్యులతో కలిసి ప్రధానోపాధ్యాయునికి జరిగిన విషయంపై నిలదీయగా.. ఒక బెండకాయలా వచ్చినా.. అదేం లేదని బుకాయించే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఎస్ఎంసి కమిటీ మేము చేసుకుంటాము మీరేంటి మాకు అడిగేదంటూ సదరు ప్రధానోపాధ్యాయుడు సర్పంచ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నేరుగా జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్‌కు చరవాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. స్పందించిన జిల్లా విద్యాధికారి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు సర్పంచ్ వివరించారు. ఈ ఘటనపై మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డికి వివరణ కోరగా తాను నిజామాబాద్‌లో ఎన్నికల నిర్వహణ విధుల్లో ఉన్నానని, తన దృష్టికి వచ్చినదని మరోమారు ఇలా జరగకుండా జాగ్రత్తలు తీసుకునే విధంగా చూస్తామని, సోమవారం తాను పాఠశాలకు సందర్శించి పూర్తి వివరాలు కనుక్కుంటానని బదులిచ్చారు.



ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఉమ్మడి జిల్లాలో

14 నామినేషన్లు

- నిజామాబాద్ జిల్లాలో 7.. కామారెడ్డిలో 7 దాఖలు
- బాన్సువాడలో నామినేషన్ వేసిన స్పీకర్ పోచారం..

2లో...

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో శనివారం రెండో రోజు 14 నామినేషన్లు దాఖలు అయ్యాయి. అయితే బాన్సువాడ పట్టణంలోని స్వంత నివాసం నుంచి తనకు నచ్చిన అంబాసిడర్ కారులో వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. ఉమ్మడి జిల్లాలోని బాల్కొండ, ఎల్లారెడ్డి నియోజకవర్గాల నుంచి ఒక్క నామినేషన్ సైతం దాఖలు కాలేదు.



బాన్సువాడలో నామినేషన్ వేస్తున్న స్పీకర్ పోచారం

ఉమ్మడి జిల్లాలో 14 నామినేషన్లు

- నిజామాబాద్ జిల్లాలో 7.. కామారెడ్డిలో 7 దాఖలు
- బాన్సువాడలో నామినేషన్ వేసిన స్పీకర్ పోచారం..

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ జిల్లాలో 7 నామినేషన్లు దాఖలు అయ్యాయి. అందులో నిజామాబాద్ అర్బన్ నుంచి ఒక్కో సెట్టుగా రెండు నామినేషన్లు, ఒకటి ఇండిపెండెంట్ అభ్యర్థి రాగి అనిల్, మరొకటి బహుజన లెఫ్ట్ పార్టీ అభ్యర్థి దండి లత, రూరల్ నియోజకవర్గం నుంచి ఒక్కో సెట్టుగా రెండు నామినేషన్లను, ఒకటి ఇండిపెండెంట్ అభ్యర్థి దేగవత్ శివరాం, మరొకటి ఆల్ ఇండియా మజ్లిస్ ఈ ఇన్కులబ్ మిలత్ అభ్యర్థి సాయన్న చావ్లా, బోధన్ నియోజకవర్గంలో ఒకే నామినేషన్ ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థి పి.సుదర్శన్ రెడ్డి రెండు సెట్లను దాఖలు చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఒకే నామినేషన్ భారత్ రాష్ట్ర సమితి అభ్యర్థి శ్రీనివాస్ రెడ్డి పరిగే రెండు సెట్లను దాఖలు చేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ఒక నామినేషన్ ఇండిపెండెంట్ అభ్యర్థి ఒక సెట్టును దాఖలు చేశారు. బాల్కొండ నియోజకవర్గంలో ఒక నామినేషన్, ఒక సెట్ కూడా దాఖలాలు కాలేదు.

రెండో రోజు ఏడు నామినేషన్లు దాఖలు..

కామారెడ్డి: నామినేషన్ల స్వీకరణ రెండవ రోజైన శనివారం (7) నామినేషన్లు దాఖలయ్యాయని జిల్లా ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలో ఆరు నామినేషన్లు, జుక్కల్ నియోజకవర్గంలో ఒక నామినేషన్ దాఖలు కాగా ఎల్లారెడ్డి నియోజక వర్గం నుంచి ఎటువంటి నామినేషన్లు దాఖలు కాలేవని ఆయన తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులుగా రమేష్ కుమార్ చలిక, చంద్రశేఖర్ చలిక, చిట్టబోయిన నటరాజు, నిఖిల్‌రెడ్డి, బెల్లాపురం సంతీష్ కుమార్, కంటె సాయన్న ఒక్కో సెట్ చొప్పున నామినేషన్ వేశారని ఆయన తెలిపారు. జుక్కల్ నియోజకవర్గంలో బహుజన సమాజ్ పార్టీ నుంచి ఏకాంబికర్ ప్రజ్ఞకుమార్ నామినేషన్ దాఖలు చేశారని కలెక్టర్ తెలిపారు.

బాన్సువాడలో నామినేషన్ వేసిన స్పీకర్ పోచారం..

నసురుల్లాబాద్(బాన్సువాడ): బాన్సువాడ పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. శనివారం బాన్సువాడ పట్టణంలోని స్వంత నివాసం నుంచి తనకు నచ్చిన అంబాసిడర్ కారులో వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. 1994 నుంచి ఆనవాయితీగా వస్తున్న తన పాత అంబాసిడర్ కారులోనే ఇప్పటికీ పోచారం నామినేషన్ వేసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ పోటీ చేసే అభ్యర్థులు హుందాతనంగా ఉండాలని సూచించారు. పనితీరు బాగుండాలని.. ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల కోసం పని చేయాలన్నారు. ఇల్లు అలకగానే పండుగ కాదన్నారు. 1994 నుంచి ఇప్పటి వరకూ 8 సార్లు పోటీ చేసి 7 సార్లు గెలిచానని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టో అద్భుతంగా ఉందన్నారు. బీఆర్ఎస్‌ది ఆమోద యోగ్యమైన, అమలు చేయదగ్గ మేనిఫెస్టో అని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కొన్ని పార్టీలు గెలుపొందిన తరువాత మరచిపోతాయని అన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ హామీలు అమలు కావడం లేదన్నారు. డీకే శివకుమార్ కర్నాటకలో ఐదు గంటల కరెంటు ఇస్తామని అంటున్నారని అన్నారు. బీఆర్ఎస్‌కు చాలా స్థానాల్లో పోటీయే లేదని సర్వేలు చెబుతున్నాయన్నారు. బీఆర్ఎస్ మూడోసారి రావడం, సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని పోచారం శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పోయిన సెల్‌ఫోన్ పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-మెండోరా

పోలీస్ స్టేషన్ పరిధిలోని చాకిర్యాల్ గ్రామానికి చెందిన యువకుడు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను పోలీసులు వెతికి పట్టుకుని అప్పగించారు. ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోకల లింబాద్రి ఫోన్ పోయింది. దీంతో ఆ వ్యక్తి మెండోరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సిఈఐఆర్ పోర్టల్‌లో అప్లోడ్ చేసి ఆ పోర్టల్ ద్వారా దొరికిన మొబైల్‌ను బాధితుడికి శనివారం ఎస్సై శ్రీనివాస్ అందించారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-వర్ని(మోస్రా)

మండలంలోని గోవూర్ హైస్కూల్లో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రవీంద్రబాబు, జరీనా, ప్రసన్నలక్ష్మిని పాఠశాల విద్యా కమిటీ, ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో శనివారం శాలువాలతో సత్కరించి, ఘనంగా సన్మానించారు. పాఠశాల చైర్మన్ నన్నేసాబ్ మాట్లాడుతూ, పాఠశాల కుటుంబం లాంటిదని, ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడం బాధగా ఉన్నప్పటికీ వృత్తిలో బదిలీ తప్పదని ఆయన పేర్కొన్నారు.

కార్మికుడి కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికునిగా విధులు నిర్వహిస్తున్న దర్శనం సాయిలు శుక్రవారం గుండె నొప్పితో మృతి చెందడంతో సర్పంచ్ లోలం సత్యనారాయణ గ్రామ పంచాయతీ నుంచి రూ.ఐదు వేలు, తన స్వతహాగా ఐదు వేల రూపాయలు ఆర్థిక సహాయన్ని మృతుని భార్య దర్శనం సాయమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు దశరథం, జాల్లాల లావణ్య మోహన్, గంగాధర్, ఎంబడి మోహన్, శ్రీనివాస్, మమ్ముళ్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని నసురుల్లాబాద్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మైలారం సొసైటీ అధ్యక్షుడు పెరిక శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని అంకోల్‌తండా గ్రామంలో బాన్సువాడ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతుగా అంకోల్ తండాలో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి అభివృద్ధి సంక్షేమ పథకల వివరాలను వివరించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మైలారం సొసైటీ చైర్మన్ మండల పార్టీ అధ్యక్షుడు పెరిక శ్రీనివాస్ మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో మరోసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాల్య విఠల్, జిల్లా కో ఆప్షన్ నెంబర్ మాజీద్, నాయకులు అరుణ్ నాయక్, సక్రు నాయక్, దుర్కి మోహన్, రైతు సమన్వయ కన్వీనర్ సాయిలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూపతిరెడ్డితో కలిసి కిసాన్‌కేత్ అధ్యక్షుడు ముప్పగంగారెడ్డి ప్రారంభించారు. అలాగే నర్సింగ్‌పల్లిలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుండి వివిధ నాయకులు దాదాపు 1500 మంది ముప్పగంగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి డాక్టర్ భూపతిరెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయి రెడ్డి, సూర్యరెడ్డి, శేఖర్‌గౌడ్, చామకుర అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు శ్రీరామరక్ష

- నాగమడుగు లిఫ్ట్ ద్వారా నీళ్లు తెచ్చి మీ రుణం తీర్చుకుంటా
- ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలే మళ్లీ గెలిపిస్తాయని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలోని చిన్న దేవిసింగ్ తండా, టికరంతాండ, బూరుగుపల్లి, సముదార్ తండా, చావని తాండ, తలాబ్ తండా, శివాపూర్, అంజని పెద్ద కొడపగల్ మండల కేంద్రంలో రెండవ రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలు తీర్చలేకపోయారని తాగునీరు ఇవ్వలేకపోయారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గత తొమ్మిది సంవత్సరాలుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అని ఆయన అన్నారు. గత తొమ్మిది సంవత్సరాలలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన కేసిఆర్ ఎన్నికల సందర్భంగా కొత్త మేనిఫెస్టో తెలంగాణ ప్రజల కోసం మరికొన్ని సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. ముఖ్యంగా మహిళల కోసం సౌభాగ్య లక్ష్మీ పథకం కింద ప్రతి మహిళలకు నెలకు 3000 చొప్పున ఆర్థికసాయం అందించనున్నామని అన్నారు. అంతేకాకుండా రేషన్ మీద ప్రతి కుటుంబానికి సన్న బియ్యం కూడా అందిస్తామన్నారు. మండల కేంద్రంలో ప్రజలు షిండే ను డాన్స్ చేస్తూ స్వాగతం పలికారు. పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు సుమారు 15 మంది పార్టీలోకి చేరారు. ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సొసైటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి, సర్పంచ్‌ల మండల అధ్యక్షులు తిరుమల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సతీష్ యాదవ్, హనుమంత్‌రెడ్డి, పలు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

నవతెలంగాణ-బాల్కొండ/ఏర్గట్ల/ముప్కాల్

అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని సిఐ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం బాల్కొండ మండల కేంద్రంలో బిఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు.

ఏర్గట్ల: మండలంలోని తొర్తి గ్రామంలో ఎస్సై మచ్చేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అదనపు పోలీస్ బలగాలతో పోలీస్ కవాతు నిర్వహించారు.

ముప్కాల్: ముప్కాల్ గ్రామపంచాయతీ కార్నర్ రోడ్డు నుండి బైపాస్ రోడ్డు వరకు గ్రామంలో పోలీస్ కవాతు చేపట్టారు. ఆర్మూర్ ఏసీపీ జగదీష్ చందర్ ఆధ్వర్యంలో ఆర్ఎఎఫ్ అధికారులు, పోలీసు సిబ్బంది "పోలీస్ కవాతు" చేపట్టి ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా గట్టి నిఘా ఉంచాలి

మొదటిపేజీ తరువాయి..

అనంతరం ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎ.శక్తి మాట్లాడుతూ.. అవసరమైతే ఎక్కువ సంఖ్యలో నిఘా బృందాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. బ్యాంకుల ద్వారా పెద్ద మొత్తంలో జరిగే లావాదేవీలతో పాటు యూ.పీ.ఐ ద్వారా నిర్వహించే నగదు చెల్లింపులను సైతం నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల్లో మద్యం, నగదు పంపిణీ జరగకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని, ఆర్టీసీ బస్సులలో సైతం వీటిని తరలించకుండా ఉండేలా డ్రైవర్, కండక్టర్లకు జాగ్రత్తలు సూచించాలని అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సెంటర్, కంట్రోల్ రూంలను వ్యయ పరిశీలకులు సందర్శించి వాటి పనితీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కలెక్టర్ మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని మానాల రెవెన్యూ గ్రామం జాబితాలో కొనసాగుతున్న నాలుగు పోలింగ్ కేంద్రాలు రాజన్నసిరిసిల్ల జిల్లాలోకి వస్తాయని కలెక్టర్ తెలిపారు. ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 36 మండలాలు ఉన్నాయని, 1549 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎలక్షన్ కోడ్ తు.చ తప్పకుండా అమలయ్యేలా అన్ని చర్యలు తీసుకున్నామని, సంబంధిత కమిటీలను నియమించి పకడ్బందీ పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. అభ్యర్థులు, ఆయా పార్టీల ఎన్నికల వ్యయాన్ని లెక్కించేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు ఇప్పటికే క్షేత్రస్థాయి నుండి అన్ని విధాలుగా పరిశీలన జరుపుతున్నాయని, నామినేషన్ల ప్రక్రియ ముగిసిన మీదట అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా మరిన్ని బృందాలను నియమిస్తామని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా ఐడిఓసిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సి.విజిల్, 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా కూడా ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే ఎఫ్.ఎస్.టీ, ఎస్.ఎస్.టీ బృందాలు తక్షణం స్పందించేలా చర్యలు తీసుకున్నామని, వారి వాహనాలకు అధునాతన కెమెరాలను ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామని వివరించారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి అధికారులు పాల్గొన్నారు.

దోపిడీ రాజకీయాలను ఓడించాలి

- ఓటర్ల చైతన్య యాత్ర

నవతెలంగాణ-బాల్కొండ

ఎన్నికల్లో అవినీతి ఆర్థిక దోపిడీ రాజకీయాలను ఓడించాలని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టీఎస్‌డీఎఫ్) పిలుపునిచ్చింది. శనివారం జాగో తెలంగాణ, తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు చైతన్య యాత్ర బాల్కొండలో సాగింది. ఈ సందర్భంగా ఆ నాయకులు మాట్లాడుతూ.. డబ్బుకు, మతానికి, కులానికి, లోబడకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలను కోరారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటేస్తే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. మత విద్వేష విభజన నియంతృత్వ పాలనతో అదాని అంబానీలకు సేవ చేస్తున్న ప్రభుత్వాన్ని ఓడించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, వినయ్ రెడ్డి, పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవారం, నిర్మల, పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

లారీ ఢీకొని అత్త, అల్లుడు మృతి

- మాక్లూర్ మండలం

చిక్లీ శివారులో ఘటన

నవతెలంగాణ-మాక్లూర్

లారీ ఢీకొని అత్త, అల్లుడు మృతిచెందారు. ఈ ఘటన మండలంలోని చిక్లీ గ్రామ శివారులో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నందిపేట్ మండలం కంఠం గ్రామానికి చెందిన రేవల్లి భూమన్న (44) తన అత్త అయిన గండం నాగమణి (52)ని ఎక్సెల్ వాహనంపై ఎక్కించుకుని నవీపేట్ మండలం జన్నెపల్లి నుంచి నందిపేట్ మండలం కంఠం గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలోని మాక్లూర్ మండలంలోని చిక్లి గ్రామ శివారుకు చేరుకోగానే.. ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని మృతులను గుర్తుపట్టి కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబీకులు అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరవుతున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అత్త, అల్లుడు

కాంగ్రెస్ చేరిక


కాంగ్రెస్‌లో పలువురు చేరిక

నవతెలంగాణ-భీంగల్

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లికొండ గ్రామానికి చెందిన చైతన్య, రహత్‌నగర్ గ్రామ బిజెపి అధ్యక్షుడు రాజేందర్, బిజెపి ఎస్టీ సెల్ మండల ఉపాధ్యక్షుడు లింబాద్రి, నరేష్, లక్ష్మణ్, గణేష్, శ్రీరామ్, శ్రీనివాస్ మరో 50 మంది బిజెపి కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే రామ్‌సింగ్ తండా, సేవాలాల్ తండాలకు చెందిన పలువురు బంజారులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ముత్యాల సునీల్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చరణ్‌గౌడ్, అనంతరావు, జె.జె.నరసయ్య, రంజిత్, వాకమహేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొంతగూటికి చేరిన రాజేశ్వర్..

మండలంలోని బాచన్‌పల్లి గ్రామానికి చెందిన రాజేశ్వర్ కాంగ్రెస్ పార్టీ బాల్కొండ అభ్యర్థి ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో సొంతగూటికి చేరారు. రాజేశ్వర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో వేముగంటి ప్రాజెక్ట్ చైర్మన్‌గా పనిచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరిన ఈయన గ్రామ శాఖ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయనకు సునీల్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన
శ్రీకృష్ణ యాదవ యువజన సంఘం సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ యువజన సంఘం సభ్యులు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డిని నాయకత్వాన్ని బలపరుస్తూ శ్రీకృష్ణ యాదవ యువజన సంఘం సభ్యులు పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ప్రజా నిలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన శ్రీకృష్ణ యాదవ యువజన సంఘం సభ్యులకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముత్యాల సునీల్ కుమార్ కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీల్ కుమార్ రెడ్డి విజయం కోసం కృషి తమ వంతు ఇది చేస్తామని పార్టీలో చేరిన యాదవ్ యువజన సంఘ సభ్యులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో శ్రీకృష్ణ యాదవ్ యువజన సంఘం అధ్యక్షులు బాస నరేష్ యాదవ్, కార్యవర్గ సభ్యులు మనోహర్ యాదవ్, అరవింద్ యాదవ్, ప్రశాంత్ యాదవ్, గుంటి అశోక్ యాదవ్, బాస దిలిపి యాదవ్, మధు యాదవ్, సతీష్ యాదవ్, మల్లేష్ యాదవ్, తరుణ్ యాదవ్, దేవేందర్ యాదవ్, వినోద్ యాదవ్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి తక్కురి దేవేందర్, మైనార్టీ నాయకుడు యం.డి మూకీం తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరిన సంఘం సభ్యులు

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని పెద్దఎక్లారా గేటు వద్ద గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ పి.సవితను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బిచ్కుంద మండలం మానేపూర్ గ్రామానికి చెందిన దాసరి వసుధ (16) గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరం చదువేది. కాగా ఆ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో ఆ పాఠశాలలోని బ్లాక్ రూములో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే కారణమంటూ సాంఘిక సంక్షేమ శాఖ రాష్ట్ర అధికారులు ధృవీకరించి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న పి.సవితను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

గొర్రెల నివారణకు టీకాలు

వతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నాగంపేట్ గ్రామంలో మేకలు, గొర్రెలకు ఉచిత (పీపీఆర్) 'పెస్టిడోస్ పేటిటేస్ రుమేనేట్స్' టీకాలు వేసినట్టు పశు వైద్యాధికారి గౌతమ్ రాజ్ తెలిపారు. గ్రామంలో దాదాపు పదిహేను వందలకుపైగా మేకలు, గొర్రెలకు ఉచిత టీకాలు వేశామని అన్నారు. టీకాలు వేయడం వల్ల మేకలు, గొర్రెలు పూర్తి ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు. గొర్రెల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పసుమిత్ర లక్ష్మీ, గోపాలమిత్ర ప్రణీత్, సిబ్బంది మల్లయ్య, షకిల్, గొర్రెల యజమానులు పాల్గొన్నారు.


టీకాలు వేస్తున్న వైద్యాధికారి

విద్యార్థులను ఆటోలలో తరలిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : ఏబీవీపీ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం విద్యార్థులను ఆటోలలో, ప్రైవేటు వాహనాలలో తీసుకెళ్తున్నారని, ఆ యాజమాన్యంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ, ఎస్ఎఫ్ఎస్ కామారెడ్డి ఇంచార్జ్ గంధం సంజయ్ తెలిపారు. శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం తమ ఇష్టానుసారంగా ప్రైవేట్ వాహనాలలో విద్యార్థులను తరలిస్తూ జీవితాలతో ఆటలాడుతుందని అన్నారు. తక్షణమే ఎంఈఓ ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దత్తాత్రేయ, రాజేందర్, శివకృష్ణ, అజయ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సంజయ్

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఎంపీపీ కుంచాల విమల, జడ్పిటిసి తనుజ శ్రీనివాస్ రెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లతా దేవరాజ్, ఎంపీటీసీ రాజు, ఉప సర్పంచ్, మాజీ సర్పంచ్ శ్రీపతి శేఖర్, గ్రామ టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం


ఆయుర్వేద మందులను పంపిణీ చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం శివారులోని పాటీ హనుమాన్ ఆలయం వద్ద శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన స్వర్గీయ బెజ్జారపు గంగామణి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఈ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు కొనసాగిన ఈ శిబిరంలో నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఆయుర్వేద వైద్యులు డాక్టర్ బెజ్జారపు రాము రోగులకు ఆయుర్వేద వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా ఆయుర్వేద మందులను అందజేశారు. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న వారి కోసం పాటి హనుమాన్ దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లికి చెందిన సాయి శ్రీనివాస హాస్పిటల్ చైర్మన్ బెజ్జారపు శ్రీనివాస్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు బెజ్జారపు మురళి, కుటుంబ సభ్యులు, పాటి హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆర్మూర్

భారత విప్లవోద్యమ నేత కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి 39వ వర్ధంతి సభలను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) రామచంద్రన్ పార్టీ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శనివారం పట్టణంలో ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బొట్ల రాజు అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ.ఎంఎల్.రామచంద్రన్ పార్టీ ఉత్తర తెలంగాణ కార్యదర్శి సుధాకర్ ముఖ్యఅతిథిగా సమావేశానికి హాజరై మాట్లాడుతూ.. 9న చంద్ర పుల్లారెడ్డి వర్ధంతి సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి కర్నూలు జిల్లా వెలుగోడు గ్రామంలో పుట్టి భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాటం చేశాడని తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం ఆయన కన్న కలల్ని నిజం చేయాలని వాటిని మనం ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి బొట్ల రాజు, సబ్ డివిజన్ కార్యదర్శి తూర్పాటి శ్రీనివాస్, నాయకులు సృజన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఐ నాయకులు

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలం లోని నల్లూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. గత తొమ్మిది సంవత్స రాలుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తూ పార్టీ నాయకులు ఓటరులకు కారుగుర్తుకు ఓటెయ్యాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్‌రెడ్డి, నల్లూరు ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ ప్రచారంలో పాల్గొన్నారు. బాల్కొండ నియోజకవర్గానికి వేముల ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధిని మరవకుండా ఓటు వేసి మళ్ళీ ప్రశాంత రెడ్డిని తిరిగి బాల్కొండ ఎమ్మెల్యేగా గెలుపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ప్రచార కార్యక్రమంలో మండల, గ్రామ స్థాయి నాయకులు, పార్టీ కార్యకర్తలు, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

జాగృతిలో చేరిన బీజేవైఎం కార్యకర్తలు



జాగృతిలో చేరిన బీజేవైఎం కార్యకర్తలు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ కు చెందిన బీజేవైఎం కార్యకర్తలు శనివారం జాగృతి జిల్లా అధ్యక్షులు అవంతి కుమార్, నియోజకవర్గ కన్వీనర్ గట్టు హరికృష్ణ ఆధ్వర్యంలో భారత జాగృతిలో చేరారు. భారత్ జాగృతి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్శితులై 80 మంది బీజేవైఎం కార్యకర్తలు జాగృతిలో చేరినట్లు గట్టు హరికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత్ జాగృతి సీనియర్ నాయకులు సుకుమార్ రావు, సాయి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

నవతెలంగాణ-బోధన్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అంతరాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టు సాలూర వద్ద ఎక్సైజ్ శాఖ అధికారులు 24 గంటల పాటు నిరంతరంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. శుక్రవారం రాత్రి మహారాష్ట్ర నుంచి తెలంగాణాకు వచ్చే ప్రతి వాహనాన్ని ఎక్సైజ్ సీఐ రాణీ, సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ రాణి మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర నుంచి మద్యం అక్రమంగా రవాణా కాకుండా సాలూర చెక్ పోస్టు వద్ద పకడ్బందిగా నిఘా వేసి వాహనాల తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.

పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ



అవగాహన కల్పిస్తున్న అధికారి

ఎన్నికల్లో ఎంతో ప్రాధాన్యతతో కూడుకుని ఉండే పోలింగ్ విధులను ప్రిసైడింగ్ అధికారులు (పీ.ఓలు), సహాయ ప్రిసైడింగ్ అధికారులు (ఏ.పీ.ఓ.లు) సమర్ధవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. పోలింగ్ రోజున కలెక్టర్‌తో పోలిస్తే పీ.ఓ లు నిర్వర్తించాల్సిన బాధ్యత ఎంతో ఎక్కువ అయినందున క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రిసైడింగ్ అధికారులకు శనివారం మలివిడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిబంధనలు పక్కాగా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని, ఏ చిన్న తప్పిదానికి ఆస్కారం కల్పించకూడదని సూచించారు. పోలింగ్ సందర్భంగా పొరపాట్లకు తావిస్తే, కౌంటింగ్ ప్రక్రియకు ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. ముఖ్యంగా మాక్ పోల్ జరిపిన తరువాత తప్పనిసరిగా డాటాను డిలీట్ చేయాలని, ఈ విషయాన్ని ప్రతి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి గుర్తుంచుకోవాలని అన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందు కంట్రోల్ యూనిట్ డేటా జీరో ఉందా లేదా అన్నది తప్పక పరిశీలించుకోవాలని తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఓటింగ్ యంత్రాలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, మాక్ పోల్ సమయంలో సాంకేతిక ఇబ్బంది ఏర్పడినప్పుడు సంబంధిత బీ.యూ, సి.యూ, లేదా వివి.ప్యాట్ యంత్రాన్ని మాత్రమే మార్చాలని, పోలింగ్ సమయంలో మాత్రం కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లలో ఏ ఒక్క దానిలోనూ సమస్య తలెత్తినా సి.యు, బీ.యు లు రెండింటిని మార్చాలని సూచించారు. పోలింగ్ విధులు కేటాయించబడిన అధికారులు, సిబ్బంది ఈ నెల 29 న ఉదయం 7.00 గంటల వరకు తమతమ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. చెక్ లిస్టుకు అనుగుణంగా పోలింగ్ సామాగ్రి ఉందా.. లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని సూచించారు. శిక్షణ తరగతుల్లో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, మాస్టర్ ట్రైనర్లు, ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

- ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బిగాల గణేష్‌గుప్త

నవతెలంగాణ-కంఠేశ్వర్



ప్రచారం సందర్భంగా ఎమ్మెల్యే బిగాలకు హారతి పడుతున్న మహిళ

అభివృద్ధిని చూసి ఆదరించాలని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బిగాల గణేష్‌గుప్త అన్నారు. నిజామాబాద్ నగరంలోని 44, 46, 47వ డివిజన్‌లోని పోచమ్మగల్లీ, ముదిరాజ్ గల్లీ, వీక్లీ మార్కెట్, పూసలగల్లి, ఉప్పర్ టెక్డి, పులాంగ్‌లలో ఇంటింటికి తిరుగుతూ శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో మహిళలు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతూ అపూర్వ స్వాగతం పలుకుతున్నారని అన్నారు. వారి అభిమానానికి ధన్యవాదాలు తెలియజేశారు. నిజామాబాద్ నగరం ప్రధాన రోడ్లని విశాలంగా మార్చామని, అంతర్గత రోడ్లను మెరుగుపరిచామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, మినీ ట్యాంక్ బండ్, ఎల్లమ్మగుట్ట వద్ద ఆర్ యు బి నిర్మించామని తెలిపారు. నగరంలో 25 కిలోమీటర్లు సెంటర్ మీడియాన్ నిర్మించామని, నిజామాబాద్ నగరం అందమైన లైట్లతో పచ్చని చెట్లతో విరాజిల్లుతుందని అన్నారు. అభివృద్ధిని ఆదారిస్తూ, సంక్షేమం కొనసాగింపు కోసం కారు గుర్తుకి ఓటువేసి బీఆర్ఎస్ పార్టీని బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్, 44వ డివిజన్ కార్పొరేటర్ బైఖాన్ సుధ,నాయకులు బైఖాన్ మధు,రాజేంద్ర ప్రసాద్, కొండపాక జ్యోతి రాజేష్, నీలగిరి రాజు, 46వ డివిజన్ కార్పొరేటర్ అక్బర్ హుస్సేన్, 47వ డివిజన్ కార్పొరేటర్ బద్దురి మృదుల, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ బిగాల గెలుపు కోసం నిజామాబాద్ నగరంలో బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలు, నాయకులు ప్రచారం శనివారం నిర్వహించారు.ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎమ్మెల్యే గణేష్ బిగాల నాయకత్వంలో నిజామాబాద్ నగరం జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి కారు గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి



కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డిని బాల్కొండ ఎమ్మెల్యేగా గెలుపు కోసం శనివారం మండల కేంద్రంలో 16 వ వార్డులో నాయకులు షేక్. వాహేబ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం మొదలుపెట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి గడపగడపకి తీసుకెళ్లి ప్రచారం చేశారు. మహిళలకి బీడీ పెన్షన్, దివ్యాంగులకు పెన్షన్, వృద్ధాప్య పెన్షన్, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రైతులకు పెట్టుబడి సహాయం ఇలాంటి పథకాలతో ఆదుకున్న ప్రభుత్వం ఏదైనా ఉందని అంటే బిఆర్ఎస్ ప్రభుత్వం అని ప్రజలకు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోలో కొత్త పథకాలు వివరించి ప్రజలకు తెలిపారు. ఈ ఎన్నికలలో ప్రశాంత్ రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో 16వ వార్డు బీఆర్ఎస్ ఇన్చార్జి షేక్ వాహబ్, బీఆర్ఎస్ మైనారిటీ టౌన్ ప్రెసిడెంట్ షేక్ ఆరిఫ్, బిఆర్ఎస్ నాయకులు పెద్ద బాలరాజు, ఎర్రన్న, పవన్, తెడ్డు చక్రి తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు కాంగ్రెస్



ప్రచారంలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ గ్రామంతో పాటు దూపల్లి, బోర్గం, గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గడపగడపకు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలతో ముందుకు వచ్చిందని, ఈ పథకాలతో బడుగు, బలహీన వర్గాలతో పాటు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని వారి పేర్కొన్నారు. మండల కేంద్ర మైన రెంజల్ గ్రామంలో మాజీ జెడ్పిటిసి నాగభూషణం రెడ్డి, సురేందర్ గౌడ్, ధనుంజయ్, సాయిబాబా గౌడ్, మాజీ ఎంపీటీసీ కవిత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. దూపల్లి గ్రామంలో జిల్లా నాయకులు రాములు, గంగారెడ్డి, బాబన్న, గఫార్, లచ్చయ్య కార్యకర్తలు ఉన్నారు. బోర్గం గ్రామంలో గ్రామ అధ్యక్షుడు చీరడి రవి, సిద్ధ సాయిలు, సాయి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-గాంధారి



కరపత్రాలు పంచుతున్న నాయకులు

మండలంలోని బొప్పాజీ వాడి, బూర్గుల్, పంతుల్ నాయక్ తాండ, సోమ్లా నాయక్ తాండ, గుడిమెట్ గ్రామాలల్లో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగింది. గడప గడపకు భారత రాష్ట్ర సమితి మండల నాయకుల ప్రచారం నిర్వహించారు కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపీపీ రాధబలరాం,సొసైటీ చేర్మెన్ సాయికుమార్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

గడపగడపకు బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారాన్ని ఉధృతం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రజా సంక్షేమ ఫలాలు నిరుపేదలకు అందించిన ఘనత బీఆర్ఎస్ పార్టీ దేనిని వారు స్పష్టం చేశారు. సుమారు 150 మంది కార్యకర్తలు గడపగడపకు ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్ధవాని సాయిరెడ్డి, ఫిరోజ్ ఉద్దీన్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు లక్ష్మణ్, పార్ధ రాజు, మహిళలు, యువత అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మండలంలోని తాడ్ బిలోలి గ్రామంలో రైతు బంధు జిల్లా నాయకులు ఎండి మౌలానా ఆధ్వర్యంలో గడపగడపకు ప్రచారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెలుమల సునీత నరసయ్య, లింగాల అబ్బన్న, ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ రావు, మల్ల సాయిలు, ఉప సర్పంచ్ మస్కూరి లక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.



తాడ్‌బిలోలిలో ఇంటింటా ప్రచారానికి వెళ్తున్న నాయకులు, మహిళలు

ఎర్రజొన్నల బైబ్యాక్ ఒప్పందాలే

- ఒకే ధర నిర్ణయించని ప్రభుత్వం
- ధరలో మార్పుతో రైతులకు తీవ్రనష్టం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- ప్రతి ఏటా ఇదే తంతు

ఉమ్మడి జిల్లాలోని ఆర్మూర్ డివిజన్‌లో ఎర్ర జొన్నల సాగుకు ఒప్పందాల బేరసారాలకు సిద్ధమవుతున్నారు. మరోపక్క ఈసారి ఎన్నికల జాతర మొదలైంది. డివిజన్లోని రైతులు యాసంగిలో ఈ సాగుకు మొగ్గు చూపుతుంటారు. గ్రామాల వారిగా విత్తన వ్యాపారులతో ఒప్పందాలు చేసుకుంటారు. పంట పండిన తర్వాత అదే రేటుకు కొనుగోలు చేయాలని అగ్రిమెంటు ప్రకారం ఒప్పందం చేసుకుంటూ సాగుకు శ్రీకారం చుడుతున్నారు. కొన్ని సంవత్సరాల మాదిరిగానే ఈసారి యాసంగిలో పెద్దఎత్తున సాగును చేసేందుకు సిద్ధమవుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఒప్పందాల్లో నిమగ్నమవుతున్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు మాత్రం ప్రతి సంవత్సరం బై బ్యాక్ పద్ధతిలో ఒప్పందాలు చేసుకొని సాగు చేపట్టాలని రైతులను కోరుతున్నారు.

నవతెలంగాణ-ఆర్మూర్

40 సంవత్సరాల నుండి..

ఉత్తరాది రాష్ట్రాల్లో పశువుల దానాకు వినియోగించే ఎర్రజొన్నల సాగు డివిజన్లోని రైతులు 40 సంవత్సరాల నుండి చేస్తున్నారు.. ప్రతి సంవత్సరం యాసంగిలో 40 నుండి 50 వేల ఎకరాలలో వేస్తుంటారు. ముందస్తుగానే వ్యాపారులతో ఒప్పందాలు చేసుకొని ఈ పంటను గత కొన్ని సంవత్సరాలుగా సాగు చేస్తున్నారు. అన్ని పంటల కంటే భిన్నంగా పెట్టుబడి తక్కువగా ఉండి డబ్బులు ఎక్కువగా వచ్చే ఈ ఎర్రజొన్న సాగుపట్ల ఎక్కువమంది రైతులు మొగ్గు చూపుతుంటారు. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గం గ్రామాలలో రైతులు సాగు చేస్తారు. ఈ పంటకు కూలీలు అవసరం తక్కువగా ఉండడం.నీటి వసతి ఎక్కువగా లేకున్నా పంట పండే అవకాశం ఉండడంతో బోర్ల కింద ఎక్కువ మొత్తంలో సాగు చేస్తుంటారు. మొక్కజొన్నకు బదులుగా ఎక్కువ మంది రైతులు ఈ పంట వేస్తుంటారు. పంట కూడా 100 రోజుల్లోపే చేతికి రావడం అక్టోబర్ చివరి నెల నుంచి నవంబర్ నెలలో పంట వేస్తే ఫిబ్రవరిలో కోతకు వస్తుండడంతో రైతులు ఈ పంట వేస్తుంటారు. ఈ పంట తర్వాత ఇతర చిన్న రకాల పంటలు కూడా వేసుకునే అవకాశం ఉండడం వల్ల ఎక్కువమంది రైతులు సాగు చేస్తున్నారు .ఎకరాకు దిగుబడి కూడా 20 క్వింటాళ్ల వరకు వస్తుంటాయి .

పశువులకు దానాగా ఎగుమతి..

డివిజన్లోని పండించే ఎర్రజొన్నలకు నార్త్ ఇండియాలో మంచి డిమాండ్ ఉంటుంది. రాజస్థాన్, హర్యానా, పంజాబ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. అక్కడ పశువులకు దానాగా వాడుతారు

2008 సంవత్సరంలో ఉద్యమ బాట..

2008 సంవత్సరం గిట్టుబాటు ధర కోసం ఎర్రజొన్న రైతులు చేపట్టిన ఉద్యమం పట్టణంలో తీవ్ర సంచలనం



రేపింది. వారు ఉద్యమ బాట పట్టారు. ఈ నేపథ్యంలో రైతులు పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి వ్యాపారుల ఇళ్లపై దాడులకు పాల్పడ్డారు .అడ్డువచ్చిన పోలీసులపై తిరగబడ్డారు. ఈ సందర్భంగా పోలీసులు కాల్పులు జరపగా కొంతమంది రైతులకు తూటాలు తగిలి గాయపడ్డారు ..ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపగా, బి ఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు రావలసిన 9.80 కోట్ల బకాయిలను 20 14 ఆగస్టు 11న విడుదల చేయించారు. దీంతో మూడు నియోజకవర్గాలకు చెందిన దాదాపు 25 వేల రైతులకు ప్రయోజనం కలిగింది.

బై బ్యాక్ ఒప్పందం ఉన్న ధర తగ్గింపు..

జిల్లాలో యాసంగి సాగు మొదలు కావడంతో డివిజన్లో 15 మండలాల పరిధిలోని 135 గ్రామాల వరకు ఈ పంట వేస్తున్నారు .ప్రతి సంవత్సరం కొంతమంది రైతులు ఈ పంట వేసేందుకు ముందుకు రావడంతో విస్తీర్ణం పెరుగుతుంది. ఈ సంవత్సరం కూడా 40వేల ఎకరాల వరకు ఈ ఎర్ర జొన్న పంట సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు ..ఆర్మూర్ డివిజన్ పరిధిలోని పంట సాగు చేసే గ్రామాలను గుర్తించారు. జిల్లాలోని ఎర్రజొన్న వ్యాపారులతో ఒప్పందాలు మొదలయ్యాయి. ప్రతి గ్రామం పరిధిలో ఎర్ర జొన్న సాగు చేస రైతులు వ్యాపారులను పిలుస్తూ వారితో చర్చిస్తున్నారు. సాగుకు అక్టోబర్, నవంబర్ నెల అనుకూలం కావడంతో గ్రామాలలో వ్యాపారులతో ఒప్పందాలు మొదలయ్యాయి. ప్రతి గ్రామం పరిధిలో ఎర్ర జొన్న సాగు చేసే రైతులు వ్యాపారులను పిలుస్తూ వారితో చర్చిస్తున్నారు. పంట పండించిన తర్వాత కొనుగోలు చేయాలని కోరుతున్నారు. ముందే ధర ఒప్పందం చేసుకొని పంట వేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఒప్పందాల ప్రకారం పంట వేసేందుకు సిద్ధమవుతున్నారు.

2021 సంవత్సరం ఎర్ర జొన్న డిమాండ్ ఉండడంతో జిల్లాతోపాటు కర్ణాటకలోని బళ్లారిలో తక్కువగా సాగడంతో ఈ దఫా కూడా వ్యాపారులు ఎక్కువ ధరకే ఒప్పందాలు చేసుకుంటున్నారు. గ్రామాల్లో క్వింటాలుకు 3300 నుండి 3500 మధ్య ఒప్పందాలు చేసుకుంటున్నారు.

ఆయా గ్రామాల పరిధిలో తమకు నమ్మకమైన వ్యాపారులను పిలిపిస్తూ గ్రామ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఈ ఒప్పందాలు చేసుకుంటారు. పంట పండిన తర్వాత ధర తగ్గిన పెరిగిన అదే రేటు మాత్రం పెట్టే విధంగా ముందే ఒప్పందం చేసుకొని విత్తనాలు తీసుకుంటున్నారు. సాగును మొదలు పెడుతున్నారు. ఎర్రజొన్న కొన్నిసార్లు డిమాండ్ ఉన్న మరికొన్ని సంవత్సరాలు ధర తగ్గుతుండడంతో గడిచిన నాలుగేళ్లగా ముందస్తుగానే ఒప్పందాలు చేసుకుంటున్నారు. రెండు సంవత్సరాల అనుభవాలకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు కూడా ఎర్ర జొన్న సాగు చేసే గ్రామాల్లోని రైతులకు ముందుగానే అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. బై బ్యాక్ పద్ధతిలో ఒప్పందాలు చేసుకోవాలని కోరుతున్నారు. జిల్లాలోని ఎర్ర జొన్న విత్తనాలు సరఫరా చేసే డీలర్లు 25 మంది వరకు ఉన్నారు. గుర్తింపు పొందిన ఈ డీలర్ల ద్వారానే ఎక్కువ మొత్తంలో రైతులు విత్తనాలు తీసుకొని సాగు చేస్తున్నారు. వీరే కాకుండా మరో 50 మంది వరకు వ్యాపారులు ఉన్నారు. మీరు కూడా విత్తనాలను రైతులకు సరఫరా చేసి ఒప్పందాలు చేసుకుంటున్నారు. వీరంతా విత్తనాలు ఇచ్చిన కొన్నిసార్లు కొనుగోలు సమయాలలో ధరలు తగ్గితే రైతుల నుంచి ఎర్ర జొన్నలు తీసుకోకపోవడం గమనార్హం.

ఎన్నికల సమయాన రైతన్న చేతిలో...

రైతు ఉద్యమాలకు జిల్లా కేంద్ర బిందువుగా నిలిచింది.. రాజకీయ పార్టీల ఎజెండాలు, ఎన్నికల ఫలితాలను కూడా శాసించే స్థాయిలో ఉద్యమాలు నడిపిన చరిత్ర ఇక్కడి రైతులకు ఉండడం గమనార్హం. ఈ చుట్టుపక్కల ప్రాంతాల రైతులు ఉద్యమాలు తలచుకుంటేనే ప్రధాన రాజకీయ పార్టీలు ఉలిక్కిపడే పరిస్థితి. ఎన్నికల ఫలితాలను సైతం తారుమారు చేసి ఆ సెగను దేశ రాజధాని ఢిల్లీకి తగిలేలా చేసిన నేపథ్యం జిల్లా ప్రాంత రైతులది కావడం విశేషం. పసుపు బోర్డు ఏర్పాటు, ఎర్రజొన్నల మద్దతు ధర కోసం రైతులు సుదీర్ఘ కాలంగా అనేక ఉద్యమాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్ల ఎదుట ధర్నాలు ,రోడ్లపై రాస్తారోకోలు జాతీయ రహదారుల దిగ్బంధం ఇలా గల్లీ నుంచి ఢిల్లీ దాకా నిరసన లు తెలిపారు.

2009 అసెంబ్లీ ఎన్నికలలో నిజామాబాద్ రూరల్, బాల్కొండ, ఆర్మూర్ నియోజక వర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమి ఎర్ర జొన్న విత్తనాల కొనుగోలు వ్యవహారం ఎగిసిపడిన ఆందోళనకు కారణమైంది.

దళారులే బాగుపడుతున్నారు...

ప్రభుత్వం వ్యాపారుల మాయాజాలంపై చర్యలు తీసుకోవాలి సీజన్ అంతా ఒకే ధరను ప్రభుత్వం నిర్ణయించాలి. ముందుగా ఒక ధర చివరి రోజుల్లో మరో ధర ఉండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఎన్నికల్లో అయినా పార్టీల అభ్యర్థులు రైతన్నలను ఆదుకోవాలి.

బి.దేవారం, రైతు ఐక్య కార్య చరణ కమిటీ నాయకులు-ఆర్మూర్

మేడిగడ్డ కుంగిపోవడానికి బాధ్యులైన

సిఎం, అధికారులపై చర్యలు తీసుకోవాలి :సీపీఐ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

మేడిగడ్డ కుంగిపోవడానికి బాధ్యులైన సీఎం కేసిఆర్‌తోపాటు ఇంజనీర్లు, సంబంధించిన అధికారులపై సమగ్ర విచారణ జరిపి చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం నిజామాబాద్ నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం టీఆర్ఎస్ రెండుసార్లు అధికారంలోకి వచ్చిన తర్వాత పేరు మార్చి బీఆర్ఎస్ ప్రకటించడంతో తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ రుణం తీరిపోయిందని అన్నారు. దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ ప్రచారం కోసం, పార్టీ సొంత భవనాల కోసం తెలంగాణ నిధులు వృధా చేస్తుండటంతోనే ప్రజలు, నిరుద్యోగ యువత కేసీఆర్‌పైన పెట్టుకున్న ఆశలు కుంగతీశారని అన్నారు. రాష్ట్రంలో రాష్ట్ర సంపద కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రాజెక్టులు కడుతూ ప్రస్తుతం మేడిగడ్డతోపాటు, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నీటినిలువల కోసం కాకుండా పర్యాటక కేంద్రాలుగానే మారడానికి కారణం అయిన ప్రతి ఒక్కరి పైన చట్టరిత్యా చర్యలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నదని అన్నారు. ఇంజనీర్లను కాదని కెసిఆర్ సారే... డిజైన్ చేసిన విషయాన్ని సంబంధిత అధికారులు అప్పుడు బయట పెట్టకుండా, తెలంగాణ సంపాదనంతా గంగ పాలు చేసి, పూర్తి నష్టం జరిగిపోయిన తర్వాత, మేడిగడ్డ లో మాత్రం బ్యారేజీ కడతామని, డిజైన్ చేసి తర్వాత రిజర్వాయర్‌గా మార్చడంతో..., ఒత్తిడి పెరిగి పునాదుల నుంచి ఇసుక జారిందని నీటిపారుదల శాఖ అధికారులు ప్రస్తుతం తెలియజేస్తున్నారనీ ఆవేధన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన సిమెంటు దిమ్మెలు, ఇతర నిర్మాణాలు అక్కడక్కడ కుంగిపోవటం జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సీఎం కేసీఆర్ సారే బాధ్యులు అని మాజీ అధికారులు చెప్పడం అయోమయానికి గురి చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సంపాద వృధా ఖర్చు కాకుండా కాపాడాల్సిన బాధ్యత ఉన్నత స్థాయి అధికారులపై ఉన్నదని, సర్వీస్ (హోదా)లో ఉన్నప్పుడు ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత అధికారులపైన ఉందని స్పష్టం చేశారు. అప్పుడు చెప్పకుండా నష్టం జరిగిపోయిన తర్వాత, ఇప్పుడు చెప్తే నష్టం ఎవరు పూరిస్తారని ప్రశ్నించారు. ఇకనుంచైనా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు తీర్మానం చేసి నిర్మించే నిర్మాణాలను నాణ్యతగా ఉండేటట్లు చూసే బాధ్యత అధికారులదేనని అన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులకే చెందే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నదని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర జల వనరులశాఖ అధికారులు, మేడిగడ్డ బ్యారేజ్‌తోపాటు తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన వాటిపైన సమగ్ర విచారణ చేసి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని అన్నారు. ఈ ప్రెస్ మీట్ లో సిపిఐ జిల్లా నాయకులు బి.రఘురాం, భానుచందర్, మహేష్ పాల్గొన్నారు.



ప్రచార రథానికి పూజలు చేస్తున్న నాయకులు

ప్రశాంత్‌రెడ్డిని మరోసారి గెలిపించాలి

- మానాలలో బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గం లోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రాంగి మండలం మానాల గ్రామంలో శనివారం బిఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలో బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో మంత్రి ప్రశాంత్ రెడ్డి చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. నియోజకవర్గంలో మారుమూల గ్రామమైనప్పటికీ మంత్రి ప్రశాంత్ రెడ్డి ఎంతో ప్రత్యేక చొరవ చూపి కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశారని, ఆయన్ని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు ఓటర్లకు వివరించారు. అంతకు ముందు ఎన్నికల ప్రచార నిమిత్తం గ్రామానికి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రచార రథానికి బిఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.

మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం సభ్యులు ఇంటింటికి వెళ్లి మంత్రి ప్రశాంత్ రెడ్డి చేసిన అభివృద్ధిని వివరిస్తూ, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను అందజేశారు. కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి ప్రశాంత్ రెడ్డి ని మరోసారి గెలిపించాలని కోరారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు వచ్చి చెప్పే మాయమాటలు నమ్మి మోసపోవద్దని, అభివృద్ధికి మారుపేరైన ప్రశాంత్ రెడ్డిని ఆదరించి గెలిపించాలని విన్నవించారు.

నవతెలంగాణ

బీఎస్పీలో చేరికలు



నవతెలంగాణ-మోపాల్

బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కోఆర్డినేటర్ ఎంపీ రాంజీ గౌతమ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ల సమక్షంలో అక్షిత ఫౌండేషన్ చైర్మన్ సన్నిరాపాక పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి కేవలం బహుజన సమాజ్ పార్టీతోనే సాధ్యమవుతుందని, ఇది పేదల పార్టీ అని తెలిపారు. పేదలకు న్యాయం చేయడమే ఈ పార్టీ ఉద్దేశ్యమన్నారు.

కేసీఆర్ గెలుపు కోసం కృషి చేస్తాం

- బీబీపేట్ మండల స్వర్ణకారులు



తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న స్వర్ణకారులు

నవతెలంగాణ-కామారెడ్డి

సీఎం కేసీఆర్ గెలుపు కోసం కృషి చేస్తామని బీబీపేట్ మండల స్వర్ణకారులు తెలిపారు. కామారెడ్డి నుండి ముఖ్యమంత్రి కెసిఆర్ పోటీ చేస్తున్నందున తిమ్మయ్య గారి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కెసిఆర్‌కే తమ మద్దతు అని ఏకగ్రీవ తీర్మానం చేస్తూ తీర్మాన పత్రాన్ని సుభాష్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చెల్లాపురం వెంకట్ గౌడ్, జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్, ఎంపీపీ పసులాది బాలమని, వైస్ ఎంపీపీ కప్పెర రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ మట్ట శ్రీనివాస్, యూత్ మండల సెక్రటరీ నీలస్వామి, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దోమకొండలో ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

కామారెడ్డిలో బీఆర్ఎస్ అభ్యర్థి సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇంటింటా ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ రైతు బంధు అధ్యక్షుడు నర్సరెడ్డి మాట్లాడుతూ.. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, భారీ మెజారిటీతో సీఎం కేసీఆర్‌ను గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శారద నాగరాజ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్, సర్పంచ్ అంజలి, నాయకులు సాయిరెడ్డి, దుర్గరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న చంద్రకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని గ్రామ అధ్యక్షులు నరేష్, టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భీమ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రానున్న అసెంబ్లీ ఎన్నికలలో ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ అధికారంలోకి రావడానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రకాష్ గౌడ్, సత్యం, బాలయ్య, నర్సింలు, కార్తీక్, బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ పనులూ పూర్తి చేస్తాం

- జడ్పీటీసి బాజిరెడ్డి జగన్ మోహన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత పదేండ్లుగా రూరల్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి చేశామని, కులమత, వర్గ భేదం లేకుండా అందరి సంక్షేమానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఎనలేని కృషి చేశారని, రాబోవు రోజుల్లో మరింత కృషి చేసి జిల్లాలోనే రూరల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని జడ్పీటీసి బాజిరెడ్డి జగన్ మోహన్ అన్నారు. శనివారం ఇందల్‌వాయి మండలంలోని గన్నారం జాతీయ రహదారి పక్కన గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే పలు సంఘాల అధ్వర్యంలో సమావేశాలు ఏర్పాటు చేసి ఏకగ్రీవ తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక కృషితో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో కోట్ల రూపాయల మేర అభివృద్ధి చేశారని, ఈ సారి భారీ మెజార్టీతో గెలిపించుకుంటే మంత్రి పదవి ఖాయమని, దీంతో రూరల్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ వద్దకు ఏ వర్గానికి చెందిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వెళ్తే వారందరిని కాదనకుండా సమస్యల పరిష్కారానికి అప్పటి కప్పుడే కృషి చేశారని అలాంటి నాయకునికి రూరల్ ప్రజలు వదులుకోవద్దని సూచించారు. బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా నిలుస్తామని ఇప్పటికే ఏకగ్రీవ తీర్మానం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారని, ఇదే కాకుండా పలువురు వచ్చి నామినేషన్లకు సైతం డబ్బులు అందజేస్తున్నారని, ఇతరులు మాటలను నమ్మవద్దని, ఎన్నికలు ముగిసిన తర్వాత అలాంటి వారు కనబడరని, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రజల కోసం శ్రమించే నాయకుడిని అన్నారు. కరోనా సమయంలో ఎందరికో ధైర్యం చెప్తూ వారందరికీ అందుబాటులో ఉన్నారని, ఇతరులు మాయమాటలు చెప్పి లోబర్చుకునే ప్రయత్నం చేస్తారని బాజిరెడ్డి జగన్ మోహన్ పేర్కొన్నారు. గ్రామానికి చెందిన పలువురు బిజెపి నాయకులు బాజిరెడ్డి జగన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. చేరిన వారందరికీ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు లోలం సత్యనారాయణ, మోహన్ నాయక్, రాజు నాయక్, సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు చిలువేరి దాస్, బీఆర్ఎస్ రూరల్ ఎస్సీ కన్వీనర్ పాశం కుమర్, సర్పంచ్‌లు తేలు విజయ్ కుమార్, చింతల దాస్, కచ్చకాయల శ్రీనివాస్, సుధాకర్, సుధీర్, సీనియర్ నాయకులు అరటి రఘు, సీహెచ్.దాస్, బిరిష్‌శెట్టి, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్‌మోహన్

బీడీ కార్మికులకే కాదు.. సబ్బండ వర్గాలకు అండ

- ఆయన జీవితం పేద ప్రజలకే అంకితం
- బీఎల్ఎఫ్ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

బీడీ కార్మికులకే కాదు.. సబ్బండ వర్గాలకు అండ సిద్ధిరాములు జీవితమని, ఆయన జీవితం పేద ప్రజలకే అంకితమని బీఎల్ఎఫ్ నాయకులు అన్నారు. శనివారం మాచారెడ్డి మండలంలోని ఏల్పుగొండ, పాల్వంచ, ఇస్సాయిపేట్ మూడు గ్రామాలలో బీఎల్ఎఫ్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సిరిగాద సిద్ధిరాముల జీవితం 35 సంవత్సరాలుగా పూర్తిగా పేద ప్రజల సేవకి అంకితమైందని దీనిని ప్రజలు గుర్తించాలన్నారు. ఏ రోజు కూడా ఆయన స్వార్థం కోసం పనిచేయలేదని, ప్రతి విషయంలో పేద ప్రజల సంక్షేమం కోరి ఉద్యమాలు చేశాడన్నారు. రాజకీయ నాయకులు హామీలు ఇస్తూ వదిలివేయడంతో నేడు కార్మిక నాయకులంతా కలిసి రాజకీయ పార్టీని పెట్టి ప్రజల్లోకి వస్తున్నారని అలాంటి నాయకులను ప్రజలు ఆదరించి ఓట్లు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్మిక నాయకులే అధికారంలోకి వస్తే కార్మికులకు కష్టాలు ఉండవని ఈ సందర్భంగా ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో బిఎల్ఎఫ్, రాష్ట్ర నాయకులు, యం.అంజనేయులు, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి, సిరిగాద సబిత, వెంకటేశ్, రఘుపతి రెడ్డి, కామారెడ్డి జిల్లా నాయకులు, గంగా మణి, స్వామి, సైనాజ్, లక్ష్మి రాజాశేఖర్, కర్రెవార్ నాగేష్, చంద్ర కాంత్ రెడ్డి, తలరి, స్వామి, బాబు, నవిణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎల్ఎఫ్ నాయకులు

కాంగ్రెస్ పార్టీలో చేరిక

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని ఎలాల వాడా కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో ముత్యాల సునీల్ కుమార్‌రెడ్డి సమక్షంలో చేరారు. రైతులు, ప్రజలు కాంగ్రెస్‌పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని ప్రతి వ్యక్తికి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో మోర్తాడ్ కాంగ్రెస్ నాయకులు రమేష్, గంగారెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సునిల్ కుమార్‌రెడ్డి

బహుజన రాజ్యాధికారమే బీఎల్ఎఫ్ లక్ష్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్

బహుజన రాజ్యాధికారమే బీఎల్ఎఫ్ లక్ష్యమని ఎంసిపిఐయు కార్యదర్శి అశోక్, చైర్మన్ నల్ల సూర్యప్రకాష్ తెలిపారు. శనివారం నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ బీఎల్ఎఫ్ ఎమ్మెల్యే అభ్యర్థి సబ్బని నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంసిపిఐయు కార్యదర్శి మద్దికాల అశోక్, చైర్మన్ నల్లా సూర్యప్రకాష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా ఏర్పడిన బీఎల్ఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. అర్బన్ నియోజకవర్గ అభ్యర్థి సబ్బనిలత ఇంటి నుంచి ర్యాలీ ప్రారంభమై అంబేద్కర్ కాలనీలోగల పూలే అంబేడ్కర్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి ర్యాలీకి హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. సబ్బనిలతకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్, కామారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి సిరిగాద సిద్దిరాములు, బహుజన లెఫ్ట్ పార్టీ-బిఎల్‌పి జిల్లా కన్వీనర్ కె.మధు, టి.రాజకుమార్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గీతాంజలి, రాజు, సాయి, గంగాధర్‌లతో పాటు రెండు వందల మంది ఇతరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న బీఎల్ఎఫ్ నాయకులు

బీఆర్ఎస్‌లో చేరిన రజక సంఘం సభ్యులు

- పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన మంత్రి



బీఆర్ఎస్ పార్టీలో చేరిన సంఘం సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసిఆర్ అందిసున్న జనరంజక పాలన మెచ్చి కమ్మర్‌పల్లి రజక సంఘం సభ్యులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బాల్కొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు సంఘం సభ్యులు తెలిపారు. శనివారం వేల్పూర్‌లోని తన స్వగృహంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో ఎంపిటిసి సభ్యుడు మైలారం సుధాకర్, నాయకులు కొత్తపల్లి అశోక్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు, మహిళలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి మంత్రి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు అవగాహన



మాట్లాడుతున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాణి

నవతెలంగాణ-బోధన్

ఎన్నికల నిబంధనలు, ఎన్నికల సందర్భంగా జరిగే నేరాలు, సెక్షన్లపై శనివారం బోధన్ కోర్టు ప్రాంగణంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి, పోలీసులకు అవగాహన కల్పించారు. స్టేట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, లక్ష్మీనరసయ్యల ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమం చేపట్టారు. పట్టణ ఎస్సై పీటర్, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- **మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి**

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/ సదాశివనగర్

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి మదన్మోహన్ భారీ మెజార్టీతో గెలుస్తారని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కడుపు కాలు కట్టుకొని గెలిపించిన జాజాల సురేందర్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలను నట్టేట ముంచగా.. వారందరికీ పెద్దదిక్కుగా నిలిచారని అన్నారు. బిజెపి పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ ఎల్లారెడ్డి అభ్యర్థి మదన్మోహన్ కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మదన్ మోహన్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి గడ్డ కాంగ్రెస్ పార్టీకి అడ్డా అన్నారు. కాంగ్రెస్ ప్రభంజనం ముందు ఎమ్మెల్యే జాజాల సురేందర్ నిలబడలేరని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సునామీలో బీఆర్ఎస్ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ హయాంలో జాజాల సురేందర్‌కు ఎమ్మెల్యే పదవి తప్ప ఎల్లారెడ్డి ప్రజలకు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

ఎలాంటి ఉపాధి దక్కలేదని కాంగ్రెస్ అభ్యర్థి మదన్మోహన్ విమర్శించారు. నిరుద్యోగులకు తాను ఉపాధి మార్గం చూపుతుంటే ఎమ్మెల్యే జాజాల ఓర్చుకోలేకపోయాడని తనపైన అక్రమ కేసులు పెట్టి వేధించాడని ఆయన చెప్పారు. తాను మొండి వాడినని, ఇలాంటి కేసులు బెదిరింపులకు భయపడనని, ఊపిరి ఉన్నంత వరకు ఎల్లారెడ్డి ప్రజలకు సేవ చేస్తానని అభ్యర్థి మదన్మోహన్ స్పష్టంచేశారు.

ఒక్క రూపాయి జీతం తీసుకుని ప్రజలకు సేవ చేస్తా..

సదాశివనగర్: ఒక్క రూపాయి జీతం తీసుకుని ప్రజలకు సేవ చేస్తానని ఎల్లారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి మదన్ మోహన్ అన్నారు. మండలంలోని మర్కల్ స్టేజీవద్ద గల అశోక్ గార్డెన్‌లో వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సమావేశానికి ఎల్లారెడ్డి నియోజకవర్గంలో సదాశివనగర్, రాజంపేట్, తాడ్వాయి, గాంధారి మండలాలకు చెందిన పలువురు చేరారు. ఈ కార్యక్రమంలో ఏనుగు మంజుల, లింగాగౌడ్, బాగయ్య, ఇర్షదుద్దీన్, సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ చేపట్టిన ఫ్లయింగ్ స్క్వాడ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని సికింద్రాపూర్ గ్రామంలో ఫ్లయింగ్ స్క్వాడ్ యూసుఫ్‌ఖాన్ శనివారం ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. సికింద్రాపూర్ గ్రామంలో రాజకీయ నాయకుల వాహనాలను తనిఖీ చేశారు. మండల కో ఆప్షన్‌మెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్ వాహనాన్ని, అలాగే కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు చిన్నారెడ్డి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.



కారును తనికీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

బాలల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న మండల అధికారి

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని కృష్ణాజివాడి ప్రభుత్వ పాఠశాలలో శనివారం మహిళా సాధికారత బృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ ప్రతి బాలిక సెల్ఫ్ అభివృద్ధి చెందడానికి హక్కులతో పాటు చట్టం, భద్రత గురించి వివరించారు. భవిష్యత్తులో అందరికీ ఆదర్శంగా ఉండాలని బాలికలను కోరారు. విద్యార్థులకు బాలల హక్కులపై ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శారద, తులసి, సౌందర్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామస్వామి, మండల విద్యాధికారి, ఉపాధ్యాయులు నివేదిత, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఏఎంసీ డైరెక్టర్



కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ ఏఎంసీ డైరెక్టర్

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం ఊట్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బలరాం నాయక్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కౌన్సిలర్ శరత్ రెడ్డి బలరాం నాయక్‌కు కాంగ్రెస్ కండువా వేసి పార్టీలో ఆహ్వానించారు. గత నాలుగు రోజులుగా ఊట్‌పల్లి గ్రామంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యుల పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే సాలూర గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త అల్లే వెంకటి సైతం గత రెండు రోజుల క్రితం బిఆర్ఎస్ పార్టీని వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వ్యయ అంశాలపై పరిశీలకులకు ఫిర్యాదు చేయొచ్చు

- **కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎవరైనా సరే ఎన్నికల వ్యయ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. జిల్లాకు చేరుకున్న ఎన్నికల పరిశీలకుల వివరాలను ఈ సందర్భంగా కలెక్టర్ తెలియజేశారు. జిల్లాలోని నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ శాసనసభ నియోజకవర్గాలకు పాటిల్ చిన్మయ్ ప్రభాకర్ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా ఉన్నారని, ఎన్నికల వ్యయ సంబంధిత అంశాలపై ఫిర్యాదులు చేయదలచిన వారు అబ్జర్వర్ సెల్ నెంబర్ 8332021903కు ఫోన్ చేయవచ్చని, నిజామాబాద్ రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ప్రతిరోజూ సాయంత్రం 4 నుండి 5 గంటల మధ్యన నేరుగా కలువవచ్చని సూచించారు. అదేవిధంగా బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులైన ఏ.శక్తిని సెల్: 8332021809 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఎస్సారెస్పీ గెస్ట్ హౌస్‌లో నిర్ణీత సమయంలో నేరుగా కలువవచ్చని అన్నారు. బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు తాన్యాసింగ్‌ను సెల్: 8332021892కు ఫోన్ చేసి, లేదా బోధన్ ఇరిగేషన్ గెస్ట్‌హౌస్‌లో సాయంత్రం 4 నుండి 5 గంటల మధ్యన నేరు గా కలిసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. వ్యయ పరిశీ లకుల మొదటి విడత పర్యటన ఈ నెల 05 వ తేదీ వరకు ఉంటుందని, రెండవ విడత పర్యటన ఈ నెల 09 నుండి పోలింగ్ పూర్తి అయ్యేంత వరకు ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో అన్నదానం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని తట్టికోటలో గల నాగయక్షయక్షిణి- రేణుకా ఆలయం 11వ వార్షికోత్సవ వేడుకలను శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టి ముగ్గుల పోటీలు, కోలాటం, మ్యూజికల్ చైర్, భజన కార్యక్రమాల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన నిర్వహకులు అబ్బయ్య స్థానిక పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్

- **జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లమడుగు షరీఫ్ కాంగ్రెస్‌కు రాజీనామా**
- **బీఆర్ఎస్‌లో చేరిక**

నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని లింగంపేట్ మండలం కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లమడుగు షరీఫ్ శనివారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమడుగు జాజాల సురేందర్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా శెట్టిపల్లి సంగారెడ్డి గ్రామానికి చెందిన 50 మంది యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో బంగారు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా పనిచేయాలన్నారు. ఎల్లారెడ్డిలో తిరిగి బీఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సురేందర్ సమక్షంలో పార్టీలో చేరిక

బీఆర్ఎస్‌లో చేరిన గొల్ల, కురుమ జిల్లా నాయకులు



బీఆర్ఎస్‌లో చేరిన గొల్ల, కురుమ నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గ పరిధిలోని గొల్ల కురుమ జిల్లా నాయకులు రానున్న ఎన్నికల్లో తమ పూర్తి మద్దతు బిఆర్ఎస్ పార్టీకే అని తెలిపి బిఆర్ఎస్ పార్టీలో శనివారం చేరారు. చేరిన వారిలో యాదవ జిల్లా కన్వీనర్ గంగుల బాబూరావు, ఆర్మూర్ యాదవ కన్వీనర్ రాజమల్లు యాదవ్, రాజన్న యాదవ్, కిష్టాన్న యాదవ్, సాగర్ యాదవ్, విజయ్ యాదవ్, సాయిలు యాదవ్, దేగం చిన్నయ్య, మహేష్ యాదవ్, విజయ్ యాదవ్, తరుణ్ యాదవ్ బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికి బిఆర్ఎస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజారామ్ యాదవ్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న ఎంపీపీ లతా

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కులాస్పూర్ గ్రామంలో ఎంపీపీ లతా గ్రామంలోని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిరెడ్డి, మోచ్చ శ్రీనివాస్, జనార్దన్, నాయకులు కన్నీరం, శ్రీనివాసరావు, నరేష్, సర్పంచులు ముత్యంరెడ్డి, సిద్ధార్థ పాల్గొన్నారు.

ఏఆర్ విజయలక్ష్మికి వీడ్కోలు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

తెలంగాణ యూనివర్సిటీలోని సారంగాపూర్ పరిధిలో ఉన్న బీఈడీ కాలేజీలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన విజయలక్ష్మి ఇక్కడినుంచి ప్రధాన క్యాంపస్ డిచ్‌పల్లికి బదిలీ అయిన సందర్భంగా సారంగపూర్ క్యాంపస్ సిబ్బంది శనివారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఆమె సూచించిన అమూల్యమైన సలహాలను ఎన్నటికీ మరువలేమని తెలిపారు. కార్యక్రమంలో సారంగాపూర్ క్యాంపస్ సిబ్బంది పాల్గొన్నారు.



విజయలక్ష్మిని సన్మానిస్తున్న క్యాంపస్ సిబ్బంది

లింగంపేట్‌లో ఇంటింటా ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు రెండోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను వేడుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటి రమేష్, సర్పంచులు, ఎంపీటీసీలు కార్యకర్తలు పాల్గొన్నారు.

అరుణాచలంకు బస్సు సౌకర్యం

- సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారుల సూచన

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/నసురుల్లాబాద్

కార్తీకమాసం సందర్భంగా అరుణాచలంకు ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు నిజామాబాద్ రీజినల్ మేనేజర్ కె.జానీరెడ్డి, బాన్సువాడ డిపో మేనేజర్ సరితదేవి తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం వీరిద్దరూ వేర్వేరుగా మాట్లాడారు. కార్తీక పౌర్ణమి మాసంలో చేసే పూజల్లో భాగంగా ఆ భక్తుల కోసం ఈ నెల 27న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నిజామాబాద్-2 డిపో ఏర్పాటు చేసిందని తెలిపారు. సర్వీస్ నెంబర్ : 96660 గల బస్సు తేదీ 25 రాత్రి 8 గంటలకు నిజామాబాద్ నుంచి బయలుదేరి 26న ఉదయం 11గంటలకు కాణిపాకం చేరుకొని విఘ్నేశ్వరుని దర్శనానంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు వేలూరు గోల్డెన్ టెంపుల్ చేరుకుంటుందన్నారు. దర్శనానంతరం సాయంత్రం 6.30 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని, గిరి ప్రదక్షిణ పూర్తి అయినా తర్వాత 27న సాయంత్రం 5గంటలకు బయలుదేరి, 28న ఉదయం 03గంటలకు జోగులాంబ ఆలయానికి చేరుకుంటుందని వివరించారు. దర్శన అనంతరం ఉదయం 9 గంటలకు బయలుదేరి 28న సాయంత్రం 07.30 గంటలకు. నిజామాబాద్ చేరుకుంటుందన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ.4200, పిల్లలకు రూ.3400 ఉందని, ఉమ్మడి జిల్లా ప్రయాణీకులు, అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ద్వారా లేదా సమీప బస్సు రిజర్వేషన్ కౌంటర్ నందు కూడా టికెట్ బుక్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. ఆసక్తి గల వారు డిపో మేనేజర్, నిజామాబాదు-2 9959226017, 7382844366, 7382846084 నెంబర్లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో బసంత్ తదితరులున్నారు.

జుక్కల్ కాంగ్రెస్ టికెట్‌పై ఉత్కంఠ

- అయోమయంలో కాంగ్రెస్ శ్రేణులు
- గంగారం పేరే పరిశీలనలో ఉన్నట్లు టాక్

నవతెలంగాణ-మద్నూర్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జుక్కల్ కాంగ్రెస్ టికెట్‌పై ఉత్కంఠ నెలకొంది. జుక్కల్ ఎస్సీ రిజర్వుడ్ నియోజవర్గం. అయితే కాంగ్రెస్ పార్టీ నుంచి అభ్యర్థి పేరు ఇప్పటివరకూ ఖరారు కాకపోవడంతో ఆ స్థానంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

జుక్కల్ కాంగ్రెస్ టికెట్‌ను కేటాయించేందుకు హైకమాండ్ జుక్కల్ మాజీ ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సౌదాగర్ గంగారం పేరునే పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. జుక్కల్ కాంగ్రెస్ టికెట్ కోసం ముగ్గురు ముఖ్య నాయకులు పోటీపడుతుండగా తోట లక్ష్మీకాంతరావుకు సైతం టికెట్ ఖరారయ్యే అవకాశాలున్నాయని జోరుగా చర్చలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా ఎట్టి పరిస్థితుల్లోనూ సౌదాగర్ గంగారం కాంగ్రెస్ టికెట్టు తనకే వచ్చే విధంగా ప్రయత్నిస్తున్నాడని, టికెట్టును వదలబోడని కాంగ్రెస్ నాయకుల్లో జోరుగా చర్చ వినిపిస్తుంది. ప్రచారానికి సమయం దగ్గర పడుతుండగా కాంగ్రెస్ జుక్కల్ టికెట్ ఖరారు కాకపోవడంపై కాంగ్రెస్ శ్రేణులే కాకుండా ఇతర పార్టీల నాయకులు కూడా కాంగ్రెస్ టికెట్‌పైనే చర్చ పెడుతున్నారు. ఒకవేళ కాంగ్రెస్ అధిష్టానం తోటా లక్ష్మి కాంతారావుకు టికెట్ కేటాయిస్తే జుక్కల్‌లో గట్టి పోటీ కొనసాగుతుందని అన్ని పార్టీల్లో చర్చ నడుస్తోంది. ఏదిఏమైనా కాంగ్రెస్ టికెట్ ఖరారుపైనే జుక్కల్ నియోజకవర్గ ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొందని చెప్పవచ్చు.

రెండవ రోజు దాఖలు కానీ నామినేషన్లు

నవతెలంగాణ-భీంగల్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా శనివారం రెండో రోజు కూడా నామినేషన్లు దాఖలు కాలేదు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు రిటర్నింగ్ అధికారులు యధావిధిగా విధులు నిర్వహించారు. నామినేషన్ కేంద్రం వద్ద ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రతి గ్రామం అభివృద్ధి చెందింది

- మంత్రి ప్రశాంత్ రెడ్డి



ప్రచారంలో పాల్గొన్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-మోర్తాడ్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందిందని మంత్రి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సుంకేట్, దోన్‌పాల్, గాండ్లపేట గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల అవసరాల మేరకు అన్ని సౌకర్యాలు సమకూర్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. 70 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు మరొక అవకాశాలు ఇవ్వాలంటూ ప్రజలను మభ్యపెడుతూ మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నాయని, ప్రజలు ఆ మాయమా టలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ఇంటింటికి నీళ్లు ఇచ్చిన ఘనత కేసిఆర్‌కే దక్కుతుందని చెప్పారు. బాల్కొండ నియోజకవర్గం తన కన్న బిడ్డగా అభివృద్ధి చేశానని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పాలవుతున్న గ్రామాలలో పూర్తిస్థాయి లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణాలు చేసి ప్రజా అవసరాలను సమకూర్చిన ఘనత తమకే దక్కుతుందని అన్నారు. వాటన్నిటిని చూసి మరో అవకాశాన్ని తమకే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆ మూడు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ ఎన్నికల ప్రచార పాట సీడీ ఆవిష్కరణ



సీడీ ఆవిష్కరిస్తున్న సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా తుజాల్పూర్ గ్రామానికి చెందిన సీఎం కేసీఆర్ అభిమాని చెప్యాల ప్రభాకర్ అనే గాయకుడు ఎన్నికల ప్రచారానికి పాట రాసి తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ అభిమానులే అతనిని గెలిపిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చెల్లాపురం వెంకట్ గౌడ్, ఐడిసిఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, జడ్పీ వైస్‌చైర్మన్ పరికీ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ పసులాది బాలమని, వైస్ ఎంపీపీ కప్పెర రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మట్ట శ్రీనివాస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సాలూర చెక్‌పోస్ట్ తనిఖీ



రికార్డును పరిశీలిస్తున్న ఐఏఎస్

నవతెలంగాణ-బోధన్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎన్నికల వ్యయ పరిశీలకురాలు ఐఏఎస్ అధికారిణి తానియాసింగ్ సాలూర చెక్ పోస్టు వద్ద ఏర్పాటుచేసిన పోలీస్ చెక్ పోస్ట్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు 10 లక్షల రూపాయలు డబ్బులను తనిఖీలలో పట్టుకుని సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు ఆమెకు తెలిపారు. ఆమె వెంట సాలూర తహసీల్దార్ మల్లేషం, ఆర్ఐ గంగాధర్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాణి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తుంటే

అధికారులు ఏం చేస్తున్నారు..?

నవతెలంగాణ-ఆర్మూర్

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు వార్డుల్లో రైస్ కుక్కర్లు, మటన్, డబ్బులు పంచుతుంటే ఎన్నికల కమిషన్ అధికారులు ఏం చేస్తున్నారని సీపీఐ జిల్లా నాయకులు ఆరేపల్లి సాయిలు శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. అవినీతి రహిత పాలన కోసం ఓటర్లను చైతన్యం చేయాల్సిన అధికార యంత్రాంగం బీఆర్ఎస్ నాయ కుల అవినీతి గురించి పట్టించుకోకపోవడం సరైంది కాదని పేర్కొన్నారు. ఇప్పటికే ఆర్మూర్ పట్టణంలోని కేసిఆర్ బహిరంగ సభకు ఆర్మూర్ నియోజకవర్గంలోని ప్రజలకు ఒక్కొక్కరికి రూ.300 చొప్పున డబ్బులు పంచుతుంటే ఎలక్షన్ కమీషన్ అధికారులకు కనబడడం లేదా అని ప్రశ్నిం చారు. పోలీసులు, ఎన్నికల కమిషన్ అధికారులు ఒకపక్క ఎన్నికల్లో డబ్బు లు రవాణా చేయకుండా అన్ని జిల్లాల సరిహద్దుల్లో చాలా పకడ్బందీగా చెక్‌పోస్టులు పెట్టీ తనిఖీలు చేస్తే బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేస్తున్న డబ్బు, మద్యం, రైస్ కుక్కర్లు ఎక్కడి నుంచి వస్తున్నాయో అధికారులు చెప్పాలని ఆయన ఎన్నికల కమిషన్ అధికారులను డిమాండ్ చేశారు.

అభ్యర్థుల ఖర్చు నిరంతరం పరిశీలన

- అధికారుల్లో తడబాటు ఉండొద్దు
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా వ్యయ పరిశీలకులు నిరంతరం డేగ కండ్లతో అభ్యర్థుల ఖర్చును పరిశీలిస్తుంటారని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఏ విషయాలు అడిగినా తడబాటు లేకుండా చెప్పేలా సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. సి-విజిల్ యాప్‌ను నిరంతరం పర్యవేక్షిస్తూ ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాల కదలికలను గమనిస్తుండాలని అన్నారు. ఏ నియోజకవర్గంలో ఎవరు విధులలో క్షేత్రస్థాయిలో ఉన్నారో గమనిస్తూ సి-విజిల్ యాప్‌కు ఫిర్యాదు వచ్చిన తక్షణమే స్పందించి సమీపంలోని ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలకు తెలపాలని, తీసుకున్న చర్యలపై రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాలలో వస్తున్న రాజకీయ ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌పై దృష్టిసారించాలన్నారు. ఎన్నికల ఉల్లంఘనకు సంబంధించి ఏదేని ఫిర్యాదు లేదా ఎన్నికల సమాచారం కొరకు సి-విజిల్, 1950 టోల్ ఫ్రీ నెంబరుతో పాటు కొత్తగా వాట్సాప్, ఈ మెయిల్‌ను క్రియేట్ చేసి కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు పనిచేసే విధంగా తగు ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల ఉల్లంఘనకు సంబంధించి ఏదేని సమాచారం తెలిస్తే వెంటనే 7901678854 వాట్సాప్ నెంబరుకు మెసేజ్ ద్వారా కానీ, ‘ంశ్రీఖ2023షశీఎజూశ్రీఐఅ‌తం.ఎఎతీఏస్త్రఖఅశ్రీ.షశీఎ మెయిల్ ఐ.డి.కి తెలపవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సురేంద‌ర్ కుమార్, శాంతి కుమార్, సతీష్ యాదవ్, సాయి భుజంగం తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు



గ్రామాల్లో పోలీసుల కవాతు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలో రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు స్వచ్ఛత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజల్లో ధైర్యం కల్పించేందుకు పోలీస్ కవాతు నిర్వహించారు. మండల కేంద్రమైన కమ్మర్‌పల్లితో పాటు ఉప్లూర్ గ్రామాల్లో పోలీస్ కవాతు నిర్వహించారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు తగిన భద్రత చర్యలు చేపట్టినట్లు ప్రజలకు విశ్వాసం కలిగించేందుకు స్థానిక పోలీసులతో కలిసి కేంద్ర బలగాలైన రాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది కమ్మర్‌పల్లి, ఉప్లూర్ గ్రామాల్లో కవాతు నిర్వహించారు. మండల కేంద్రంలో హాసకొత్తూర్ బైపాస్ ఎక్స్‌రోడ్ నుండి గ్రామ వీధుల గుండా పోలీస్ కవాతు కొనసాగింది. ఉప్లూర్ గ్రామంలో బస్టాండ్ నుండి గ్రామ వీధుల గుండా ఏర్గట్ల రోడ్డు వరకు ఈ కవాతు కొనసాగింది. ఈ కవాతులో రాపిడి యాక్షన్ ఫోర్స్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి ఎస్ఐ పి.రాజశేఖర్, అసిస్టెంట్ కమాండెంట్ జితేందర్ నద్వాల్, ఇన్‌స్పెక్టర్లు రాబిన్ బాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.